# ఇది సతి కాదంటారా?

నాలుగేళ్ల కిందట నేను అమెరికా నుండి తిరిగివచ్చేసరికి దేశంలో అన్ని దినపత్రికల్లో మొదటి పేజీని ఆక్రమించుకొని, ప్రముఖంగా నాకు కనిపించిన వార్త రాజస్తాన్‌లో 'రూప్‌కన్వర్' సతి వార్త. ఆడా, మగా నలుగురు చేరిన ప్రతిచోటా, అంతా దాని గురించే చర్చించుకొంటున్నారు. చదువుకొన్నవారే కాక, చదువు నేర్వని వారు కూడా దాని గురించి విడ్డూరంగా చెప్పుకొంటున్నారు.

అది అంత సంచలనం కలిగించిన వార్త కావడంతో సహజంగానే మారుమూల చిన్న గ్రామం అయిన భీమిలీలో కూడా దాని ప్రకంపనలు కనిపించాయి. ఆ నెలలో మేము జరుపుకొన్న "శ్రీనాథ స్మారక స్త్రీల పఠన మందిరం" ఇష్టాగోష్ఠి సమావేశంలో ఎందరో స్త్రీలు ఈ విషయంపై ఉద్రేకంగా మాట్లాడారు. మనుషుల్లో ఆటవిక మనస్తత్వం ఇంకా సమసిపోనందుకు బాధపడ్తూ మాట్లాడారు చాలామంది. ఇతర దేశస్తుల ముందు ఇటువంటి అనాగరిక చర్య మూలంగా మన భారతీయులు సిగ్గుతో తలవాల్చుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని ఏవగించుకొన్నారు మరికొందరు.

ఆ వాతావరణంలో, ఆ వేడిలో, ఆ ఆవేశంలో పాలుపంచుకొంటూ అప్పుడు నేను కూడా అదే తీరులో మాట్లాడాను.

బ్రిటీష్ ప్రభుత్వపు శాసనంతో రాజా రామమోహన్‌రాయ్ వంటి సంఘ సంస్కర్తల అకుంఠిత దీక్షతో ఏనాడో రూపుమాసిపోయింది అనుకొన్న 'సతి' దురాచారం దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత కూడా దేశంలో ఒక భాగమైన రాజస్తాన్‌లో ఇంకా సలక్షణంగా, సజీవంగా ఉండడమేగాక ఒక తరహా మనుషుల చేత 'భళిర' అని మెప్పును పొందడం నిజంగా అమానుషం అన్నాను. అన్నం తింటూ, బట్టకడ్తుంటే ప్రతి మనిషీ గర్హించవలసిన కిరాతక చర్య అన్నాను.

మేము భారతీయులం, మాది పవిత్ర భారత సంస్కృతి, మా దేశంలో స్త్రీకి ఎంతో గౌరవం, పూజ్యభావం, మన్నన, ఆదరం ఉంది! అని విదేశాల్లో డబ్బా కొట్టుకుంటూ చాటుకు తిరిగే మనం సిగ్గుతో చితికిపోవలసిన పాడుదినం. "రూప్‌కన్వర్ అగ్నిపాలైన ఆదినం" అంటూ భారమైన మనసుతో ఆనాటి సమావేశం ముగించాను.

ఇటీవల కొన్ని నెలలు కిందట జరిగిన ఇంకొక సంఘటనతో 'సతి' దురాచారం వెనుకబడిన రాష్ట్రం అయిన ఒక్క రాజస్థాన్‌లోనే కాదు, దేశంలో చాలచోట్ల ఏదో ఒక రూపంలో ఇంకా అమలులోనే ఉంది. ఎంతోమంది నిర్భాగ్య వనితలు దాని కోరల్లో చిక్కి తమ నిండు జీవితాల్ని ఇంకా నిప్పులపాలు చేసుకొంటూనే ఉన్నారు అన్న విషయం నా దృష్టిలోకి వచ్చింది.

నేను చెప్పబోయే ఈ సంఘటన విన్నాక రాజస్థాన్‌లో జరిగిన రూప్‌కన్వర్ సతికి ఇది ఏ విధంగా భిన్నమైందో మీరే ఆలోచించండి. (ఇది యదార్థంగా జరిగిన సంఘటన. ఇందులో నా కల్పన అణుమాత్రం కూడా లేదు)

ఒకరోజు మధ్యాహ్నం మూడుగంటల వేళ నేను నా గదిలో టేబుల్ ముందు కూర్చుని రాసుకొంటుండగా వీధిలో ఏదో కలకలం వినబడింది. అది ఏమా? అనే కుతూహలంతో అక్కడే ఉన్న కిటికీలోంచి బైటికి చూస్తే ఎదురుగా బీచ్‌లో ఎంతోమంది జాలరులు ఆడా, మగా గుమిగూడి ఏమో చేస్తూ, ఏమో చూస్తూ కనిపించారు. చుట్టూ చాలామంది మనుషులు గుమిగూడి ఉండడం వల్ల అసలు సంగతి ఏమిటో నాకు వెంటనే తెలిసిరాలేదు.

'ఎవరో సముద్రంలో పడిపోయి ఉంటారు' అనుకున్నాను. టేబుల్ ముందు నుంచి లేచి బైటికి వస్తూ.

భీమిలీలో సముద్రపు ఒడ్డున ఇల్లు కట్టుకొని, అక్కడ నివాసం ఏర్పరచుకొన్న ఈ పది పన్నెండు సంవత్సరాల్లో ఇటువంటి దృశ్యాలు ఇంతకు పూర్వం కూడా చూడ్డం జరిగి ఉండడం వల్ల అనాలోచనగా వెంటనే నా మనసులోకి వచ్చిన ఆలోచన ఇది.

నా అంచనా సరైనదే నేను గేటు దగ్గరికి చేరేసరికి, అప్పటికే కొందరు జాలరులు ఒక స్త్రీని నిలువునా నీళ్ళు కారుతూ, రమారమి ఎత్తుకు వచ్చిన తీరులో తెచ్చి మా ఇంటిముందు కూలవేశారు.

అప్పటికే ఆమె పొట్టలోకి పోయిన నీళ్లు కక్కించడం వగైరా ప్రాథమిక చర్యలు అన్నీ వాళ్లు చేసినట్లు ఉంది. కళ్లు విప్పి చూసి నోరు కదపి మాట్లాడకపోయినా ఆమె తెలివిలోనే ఉంది. చూసేందుకు సభ్యత సంస్కారాలు కల మంచి కుటుంబంలో పుట్టిన స్త్రీలా వుంది. వయసు, నలభై, నలభై అయిదు ప్రాంతంలో ఉండవచ్చు.

ఈ వయసులో సముద్రం పాలు కాబోతున్న ఆడమనిని, ప్రాణాలైతే వారు కాపాడగలిగారుగానీ, ఆపైన ఆమెని ఏం చెయ్యాలో, ఎవరికి అప్పగించాలో ఆ జాలరులకి తెలియలేదు. ఇటువంటి కొన్ని సందర్భాలలో అంతకు పూర్వం నేనూ, మావారూ కల్పించుకొని తగిన చర్యలు తీసుకోవడం మాత్రం వారికి తెలుసు. ఆ కారణంగానే ఈసారి కూడా ఆమెని మా ఇంటికి తేవడం జరిగింది.

ఇదిలా జరిగింది - అని పోలీసులకి తెలపడం, అసలే ఆపదలో ఉన్న మనిషిని మరిన్ని కష్టాలుపాలు చెయ్యడమే అవుతుంది. మనిషి మనిషిగా బ్రతకడానికి అవకాశం కల్పించలేని ప్రభుత్వం కూడా బ్రతకడం చాతకాక మనిషి ప్రాణాలు తీసుకోబోతే ఆత్మహత్యా నేరారోపణతో దండించే అధికారాన్ని మాత్రమే దండిగానే ఉంచుకొంటుంది. సరే ఈ విషయం ఇప్పుడు అప్రస్తుతం. జాలరులకి, వారు చేసిన సహాయానికి ధన్యవాదాలు తెలుపుతూ, మీరు ఇళ్లకి వెళ్లండి, మిగిలిన సంగతులు మేము చూసుకొంటాము, అని పంపివేశాము. ఆ వెనుక ఆమెని ఇంట్లోకి తీసుకుపోయి తడిబట్టలు వదిలించి కాస్త వేడి

కాఫీ ఆమె చేత తాగించి, ఆమె ఆ షాక్ నుండి కొద్దిగా కోలుకొన్నాక సానుభూతితో ఓదారుస్తూ స్థిమితంగా ఆమె చెప్పిన కథ ఇది.

కూడుకు, గుడ్డకు లోటులేని మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన పిల్ల ఆమె. అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ, తల్లీ, తండ్రీ అందరి మధ్యా అతి సహజంగా, అటువంటి ఇళ్ళల్లో పెరిగే అందరి ఆడపిల్లల్లాగే గడిచిపోయింది ఆమె బాల్యం కూడా.

కాలేజీలో చదువుతుండగా ఆమె తల్లిదండ్రులు మంచి సంబంధం చూసి తగినంత కట్నకానుకలతో ఆమె వివాహం జరిపించారు.

"నూరు అబద్ధాలు ఆడి అయినా ఒక పెళ్లి జరిపించు" అన్నది మనవారి సూక్తి. పెళ్లి జరిగి మూడు నిద్రలకి వెళ్లినపుడు తెలియవచ్చిన సంగతి, ఆ కుర్రాడు వైవాహిక జీవితానికి పనికిరాడనీ, పైగా గుండె జబ్బు మనిషి అనీ, అత్తింటి నుండి మూడు నిద్రలు పూర్తి చేసుకొని తిరిగి వచ్చిన ఆమె మళ్ళా ఆ గడపలో కాలుపెట్టలేదు. అటువంటి వివాహం జరిగిన కొద్దికాలంలోనే ఆ కుర్రాడు గుండెపోటుతో చచ్చిపోయాడు. పుట్టిన ఇంట వివాహిత కన్యగా మిగిలిపోయింది ఆమె. సాంప్రదాయ బద్ధులైన ఆమె తల్లిదండ్రులూ, బంధువులూ జీవితం అంటే ఏమిటో ఇంకా రుచి చూడకముందే ఆమె నుదిటిబొట్టు చెరిపి, చేతి గాజులు చిట్లగొట్టి సలక్షణంగా ఆమెని విధవని చేసి మూల కూర్చోబెట్టారు. ఇళ్లల్లో శుభకార్యాలు జరిగే సమయాల్లో ముందుకు రాకూడదన్నారు. సుఖమయ జీవితంపై ఆశలు పెంచుకోకూడదంటూ హితబోధలు చేశారు.

కాస్త అభ్యుదయ భావాలు కలవారు ఎవరైనా ముందుకివచ్చి మళ్లా పిల్లకి పెళ్లి చెయ్యమనో, మధ్యలో ఆగిపోయిన చదువును కొనసాగించి ఆమె కాళ్లపై ఆమె నిలువగలిగే ఆధారం కల్పించమనో చెప్తే 'అటువంటి పాడు ఆచారాలు మా ఇంటా, వంటా లేవంటూ విరుచుకుపడేది తల్లి. నా కూతురికి తన పిడికెడు పొట్ట కోసం ఆఫీసుల వెంటపడి ఉద్యోగం చెయ్యవలసినంత గతి పట్టలేదు, అంటూ సూచనను తోసిపుచ్చేవాడు తండ్రి.

ఈనాడు ఆత్మీయులు అనుకున్న వారి మధ్య పొందిన అవమానాలతో, మానసిక వ్యధలతో శరీర ఆరోగ్యం కోల్పోయి, తగిన ఆర్థిక రక్షణ లేక ఒంటరిగా బ్రతికే మార్గంలేక, ఒంటరిగా బ్రతికే ధైర్యం లేక తన ఈ బాధల నుండి తప్పించుకోడానికి జీవితంలో తనకి మిగిలి ఉన్న ఒక్కటంటే ఒక్కటే మార్గం మృత్యువే అన్న నమ్మకంతో, నిరాశతో, నిశ్చలత్వంతో తన నిండు జీవితాన్ని సముద్రుడి పాలు చేయతలపెట్టిన ఆ సమయంలో ఆమె రక్షణకి రావడానికి తల్లీదండ్రీ ఈ లోకంలో లేరు. తోడపుట్టిన వారు భార్యబిడ్డలతో తమ సంసార రక్షణ కార్యక్రమంలో తలమునకలై వున్నారు.

ఏ అపరాధం చేసిందని, ఎవరికి అన్యాయం చేసిందని ఆమె నిండు జీవితం అలా నిరర్థకంగా మారిపోయింది? దానికి కారణం ఏమిటి? ఆమె మెడలో అగ్నిహోత్రం ముందు మూడు ముడులూ వేసి ఆమె జీవితాన్ని బుగ్గిపాలు చేసిన ఆ మొగుడి చావు కాదంటారా?

అర్థంలేని ఆచారాలతో, మూఢనమ్మకాలతో కన్నబిడ్డల జీవితాన్ని ఎందుకూ కొరకాకుండా చేసి, జీవచ్ఛవంలా బ్రతకమని హితబోధలు చేసే హక్కువారికి ఎవరు ఇచ్చారు? ఇది ఎంత అనాగరికమైన చర్య? ఎంత గర్హనీయమైన సంస్కృతి?

"సతి" అంటే చచ్చిపోయిన మొగుడి శరీరంతోపాటు ఇచ్ఛాపూర్వకంగానో (నా అభిప్రాయంలో అది అలా జరగడం అన్నది ఎంతమాత్రం సంభవం కాదు) బంధుజనులు ప్రబోధాల వల్లనో చితిమంటల్లో పడి కాలిపోతే అది మాత్రమే 'సతి' అనిపించుకుంటుందా? నిజానికి ఆ సతి కన్నా ఇప్పుడు నేను చెప్పిన ఇటువంటి అభాగినులు అనుభవించే యాతన ఎన్నిరెట్లు అధికమైంది? చచ్చిపోయిన భర్తతోపాటు నిప్పుల్లో దూకి ప్రాణాలు అర్పించే ఆ సతివల్ల కలిగే యాతన కొన్ని నిముషాలో, కొన్ని గంటలో మాత్రమే కాని ఇటువంటి స్త్రీ జీవితాన్ని రోజు వెనుక రోజుగా బ్రతుకుపొడుగునా కాల్చి చంపుతుంది.

ఈనాటికీ ఈ ఇరవయ్యో శతాబ్దపు అంతిమ చరణంలో కూడా దేశంలో ఇటువంటి అభాగినులు ఇంకా ఎంతమంది ఉండి ఉంటారో తెలుసుకోడానికి మనం జనాభా లెక్కల జోలికి పోనక్కరలేదు. సంఘ సంస్కర్తల్ని సంప్రదించనవసరం లేదు.

మీ ఇరుగుపొరుగు ఇళ్లలో, మీ సమీప బంధువుల కుటుంబాలలో, మీ వాడల్లో, మీ గ్రామాల్లో, మీ పట్టణాలలో, మీ మహానగరాల్లో నుదుట బొట్టులేక, తలలో పూలు లేక, నవ్వుతూ నలుగురు మధ్యకి రాలేని ఏ ఒక్క స్త్రీనైనా ప్రశ్నించండి. 'అమ్మా నీ కథ ఏమిటని? అటువంటి ప్రతి స్త్రీ నోటివెంట బుగ్గి బూడిద అయిపోయిన వేదనాభరిత గాథ మీకు వినిపిస్తుంది.

దేశంలో మన కళ్లముందే, మనకి కావలసిన వారి ఇళ్లల్లోనే, ఇంకా ఈనాటికి ఆచారాల పేర జరిగే అనాచారాలతో, మూఢ నమ్మకాల మురికి భావాలతో జరుగుతుంటే ఇటువంటి 'సతుల్ని' ఆపడానికి అటువంటి స్త్రీల జీవితాలు బ్రతికి ఉండగానే బుగ్గిపాలు కాకుండా చూడ్డానికి మళ్లా ఏ రామమోహన్‌రాయో, కందుకూరి వీరేశలింగమో దివి నుండి భువికి దిగివచ్చే వరకు మనం ఎదురు చూస్తూ కూర్చోవలసిందేనా?

రాజస్థాన్ మారుమూల గ్రామంలో జరిగిన ఒక రూప్‌కన్వర్ 'సతికి' అంతగా చలించిపోయిన మనం మన కళ్ల ఎదుట జరుగుతున్న ఇటువంటి ఎన్నో తరహాల 'సతుల' గురించి ఏం చేయబోతున్నాం? ఏమి చేస్తున్నాం? కొంచెం ఆలోచించండి.

ఒంటరిగా ఒక మనిషిని నేనేం చెయ్యగలను, అని సంకోచించకండి. గోరంత దీపం కొండంత చీకటిని పారద్రోలగలదు.